# పాలమ్మ

మూడ్రోజుల్నించీ గుడ్డి ముసురు...

బురద బురదైపోయిన మట్టిరోడ్డు... అడుగు ఆసరా తప్పితే జర్రున జారినట్టే అయితంది... అంత ఇసుకుడిసుకుడు... రొచ్చురొచ్చు...

అప్పుడే తెల్లార్తంది...

నెత్తిన పాలగంప పెట్టికొని దవాదవా నడుత్తంది లస్మవ్వ. అరిగిపోయిన

సిప్పర్లతోని కొంకులదాక బురదచిల్తుంది. రోజటి నడుకే...

ఒకటా... రెండా... ఇరువై మూడేండ్ల నుంచి గిదే నడుక...

పొద్దుగాల వరకు పాలు పొయ్యక పోతే గులుక్కుంటరు. ముసురు పడవట్టె... ఉడుకుడుకు చాయె తాగుటానికి పాలకోసం ఎదిరిసూత్తరు...' అనుకుంట నడుత్తుంది.

మోతె వూరు నుంచి జయితాల రెండు కిలోమీటర్లు.

గంపల పాలచెంబులు తొల్కకుంట మొత్తగ వరిగడ్డి పరిచి ఎనిమిది చెంబులు పెట్టింది.

పన్నెండిండ్లల్ల వాడుకమాయె...

చిక్కటిపాలు... రెండు చెంబులే నీళ్లు కలుపుతది.

లస్మవ్వ పాలతోని చాయెనే కాదు... పెరుగు కూడా గడ్డలెక్కుండి రుచుంటది అంటరు వాడుకపోల్లు....

పాల పాకెట్ల కన్న ముందుగాల్నే తలుపు తడుతది లస్మవ్వ.. కొన్నిండ్లల్ల ఆడోల్లు నిద్రమబ్బులకెల్లి తలుపు తీసి గిన్నె పడుతరు.

'తెల్లారంగ ముండబొడ్డి మొకం కనవద్దని' ఎక్కడనుకుంటరోనని మొకం తిప్పుకుంటది లస్మవ్వ. అప్పుడప్పుడు కొందరికి ఆనిగెపు కాయలు, బబ్బెర్లు, బోడగాకరకాయలు, మొర్రిపండ్లు, పుల్చింతకాయలు, జున్నుపాలు తెచ్చి పెట్టది.

తొమ్మిది ఇండ్లల్ల... మూడు హోటల్లల్ల పాలు పోస్తది.

తిరుపతి హోటల్ల చుడువ అటుకులు బుక్కి ఎనిమిదింటికల్లా ఎనుకకు మర్లుతది....

ముసురెక్కువైంది..,

కాళ్లు గుంజుతున్నయ్... మోకాల్ల నొప్పుల్లేత్తున్నయ్... బొక్కలు సున్నమోలె శిదలు శిదలైనట్టు జలుపుతున్నయ్. బుచ్చన్న డాక్టర్ దగ్గర రెండు సూదులేయించుకున్నా తగ్గుతలేవు... జెల్దిన పోవాలె... బర్రెకు దయ్యం పట్టిందో, దేవుని కొంటెతనమోగని... రాత్రిపూట తన్నింది... తెల్లారంగ పాలిచ్చుటానికి సతాయించింది.

లస్మవ్వకు మెడలు, నడుం గుంజుతుంది...

మునుపటి వయసు గాదు... మునుపటి పెయ్యికాదు... పెనిమిటి ఇరువై మూడేండ్ల కింద చచ్చిపోయినప్పట్నుంచి గిదే కష్టం...

లస్మవ్వ గుండె బాధగా మూలిగింది.

కొందరు మొగోల్లు లూనాలకు పాలక్యాన్‌లేసుకొని ఆరన్ కొట్టుకుంట పోతుండ్రు... కొందరు పొల్లగాండ్లు సైకిండ్లకు పాలసీసాలు కట్టుకొని తొక్కుకుంట ఉరుకుతుండ్రు...

ఒకప్పుడు వాల్లతోని సమానంగ నడిసేది. నడిసి నడిసి బొక్కలరిగినయ్... మోసి మోసి మాడు పల్చవడ్డది...

తన పెండ్లిల్ల సైకిల్ గడియారం పెట్టాలె... ఆవు ల్యాగెను కొట్టాలె అనడిగిండు పెనిమిటి. ఆవు ల్యాగను కొట్టుడు అంటె కాదుగని... బర్రెనిచ్చిండ్రు పుట్టింటోల్లు. అప్పట్నుంచి ఎన్ని ఈతలు పెట్టింది... అన్ని పెయ్యదూడలే... తల్లి నోట్లకెల్లి ఊసిపడ్డట్టే ఉండేటియి... ఇప్పుడు పాలిచ్చే బర్రెను సూత్తె పెండ్లిల్ల కొట్టిన బర్రెనే యాదికత్తది.

"లస్మవ్వా... పొద్దెక్కిందేమే... మస్కుల్నే పోదువ్‌గద..." ఎనుకనుంచి ఎగవోసుకుంట నడుత్తంది కోటవ్వ...

"బర్రె తన్నింది బిడ్డా... ఒక్క పూటనే ఇచ్చింది" అన్నది లస్మవ్వ.

"ముసల్తనానికి నెరివడుకుంట ఏం గోసనే... రంగరాంగనుకుంట ఇంట్ల పండక కోడలు బీడీలే చెయ్యవట్టె... కొడుకు దేశమంతటూడేనాయె, ఎవ్సం చెయ్యవట్టె... వాడుకాలు బందువెట్టరాదు..." అన్నది కోటవ్వ.

"నోటికాడి బుక్క సెడగొట్టుకుంటామె కోటవ్వ.... నీకేమన్న వాడుకాలు పెరిగినయానె" అనడిగింది లస్మవ్వ.

వాన తుపతుప పడ్తంది... రోడ్డుకు రెండు వైపుల జొశరం చెట్లు జిబ్బు జిబ్బుగ పెరిగినయ్...

"వాడుకాలు ఏడ దొరుకుతున్నయే... పాలు తీసుకునేటోల్లు ఇంకోల్లకు చెప్పరాయె...అండ్లనే నీల్లు కలిపి అల్లకు మనకు పోత్తరని అనుమానపడ్తరు. ఇంగ హోటల్లోల్లకు పోత్తె పైసలు సరింగ ఇయ్యరాయె... నెలకు నాలుగైదు రోజులు పాలు పగిలినయే కోటవ్వా... గిరాకి పాడైందంటరు" అన్నది కోటవ్వ.

"గా ఎంకటపతి హోటల్లకూడా మూడు లీటర్ల పాలు పోత్తన్నవట గదనే... పాలు సరిపోతన్నయా" అంది లస్మవ్వ.

"ఏడ సరిపోతున్నయే... అనికి పైసలియ్య దైర్నంరాదు... మర్వాగి మొకపోడు. పౌడర్ కలిపి పోత్తన్న" అన్నది కోటవ్వ నవ్వుకుంట.

"నా పుటాన పుటుకుల పౌడర్ కలుపలే బిడ్డా... పాపం తల్గదానె..." అన్నది లస్మవ్వ.

"కాలమే పాపపు కాలమాయె... ఇంక తల్గుడేందె... ఆడంత నియ్యతోడని పట్టుపాలు పోత్తమా" అంది లస్మవ్వను దాటేసుకుంట...

ఉన్కమీది రోకలి లెక్కనే చిటచిట నడిచిపోయింది.

"నేను వాడుకాలు బందువెట్టాల్నట... దీని ఆశె పాడుగాను..." మనసుల తిట్టుకుంది లస్మవ్వ.

పక్కన తాడిచెట్ల ఎనుక స్మశానంల ఎవల్దో కాడు ఇంకా కాలుతనే వుంది. నిప్కల్ల నుంచి పొగలేత్తంది.

కాడుని సూడంగనే లస్మవ్వ గుండె ఇచ్చుకపోయినట్లయింది.

లస్మవ్వ పెనిమిటిని గిదే శ్మశానంల కాలవెట్టింద్రు. రోజు రాంగపోంగ అక్కడికి రాంగనే నడుక తగ్గుతది. తెల్వకుంటనే అటుదిక్కు సూత్తది... కండ్లల్ల నీల్లు తిరుగుతయ్...

ఇరువై మూడేండ్లయినా... కండ్లల్ల తడి ఆర్తలేదు.

పెండ్లయిన రెండేండ్లకు... సుధాకర్‌గాడు తొమ్మిది నెల్ల సంటోడు... గిట్లనే వాన పడంగ... అద్మరాత్రి... తలుపు గొట్టింద్రు... తలుపు తీయంగనే పెనిమిటి చిన్నప్పటి దోస్తు కృష్ణమూర్తి కనవడ్డడు... ఆయనెనుక ఇంకో ఆరుగురు... అందరి భుజాలకు తుపాకులే...

"పాత దోస్తువని వచ్చింద్రా సత్తెన్న... భారీగా వర్షం పడుతంది. అడుగు వేయస్తలేదు... తెల్లారంగనే పోతం... నీకు దయుంటె మా ఏడుగురికి కొంచెం అన్నం పెట్టియ్యరాదు" అనడిగిండు కృష్ణమూర్తి.

సత్తెన్న ఎనుకముందయిండు...

'ఆకలని వచ్చినోనికి అన్నం పెట్టకపోతె మనమేం మనుషులం... నీకైతే బొట్టు లేదు బోనం లేదు" అని లస్మవ్వ ఆ రాత్రి అన్నం వండి చల్లపులుసు చేసి పెట్టింది.

ఎన్ని రోజులైందో... కడుపునిండ తిన్నరు...

మబ్బులే్న లేసిపోయిండ్రు... పొద్దుగాల ఎనిమిదింటి వరకు పోలీస్ జీపు రానే వచ్చింది...

సత్తెన్నను తీసుకపోయినోల్లు... రెండ్రోజులకు శవాన్నిదెచ్చింండ్రు....

అప్పట్నుంచి లస్మవ్వ బతుకుపోరాటం చేసింది. అయ్యవ్వ గొట్టిన బర్రెనే దిక్కయింది. కనీ.... ఆకలితోని వచ్చినోనికి అన్నం పెట్టుడు పాపమెట్లయితదో లస్మవ్వకు ఇప్పటికి పూరాత్తిగా అర్థం కాదు.

ఇప్పటికి ఇంటికి బిచ్చగాడచ్చినా... ఏదన్న పెట్టాలంటె అగులుబుగులైతది దాన ధర్మాలతోనే పుణ్యమత్తది బిడ్డా అని... కొడుక్కు మంచి మాటలు చెప్పాలన్న నోరు రాకపోయేటిది...

అన్నాన్ని చూసినప్పుడల్లా... కలుక్కుమంటది. గుండెకు కొర్రి చీమలు పట్టినట్టు కలికలి అయితది.

కొడుకు పెద్దోడైనంక అన్నల గురించి.... పోలీసుల గురించి చెప్తుంటె ఒక్క అన్నం ముద్ద ఎనుక గింతటి పోరాటమున్నదా అనిపిచ్చేది. అర్థమైనంక ఓపారి గుట్టల్లకు పోయి అన్నలకు జున్నుపాలు పోసి వచ్చింది. కొడుక్కు తెల్సి బాగా తిట్టిండు. కాడు కాలుతనే వున్నది...

లస్మవ్వ తడిసిన కొంగుతోని కండ్లు తుడుచుకున్నది...

జెల్లి జెల్లి నడువాలని అడుగులేసింది... ముసురెక్కువైంది...

జగిత్యాలకు చేరేవరకు స్తంబం వెలుగులు ఇంక ఆరిపోలేదు. గేటు తీసుకొని ఓ ఇంట్ల అడుగువెట్టింది.

“పాల ముసల్దింకా రాలేదా...?” పేపర్ పట్టుకొని విసుక్కుంటున్నాడు ఇంటాయినె.

"పాలమ్మ రాలేదండీ... ఈపాటికి వచ్చేదే మరి" అంటున్నది ఇంటామె.

ఆ మాటలు వినుకుంటనే "పాలు వట్టుండ్రి లలితవ్వ..." అన్నది లస్మవ్వ. "గిట్ల లేటయితే వాడుకం బందుపెట్టుమంటడు మా సారు" స్టీల్ గిన్నెల పాలు పట్టుకుంట హెచ్చరించింది ఇంటామె.

లస్మవ్వ నవ్వింది... పాలకంటే తెల్లగా... గునుక పువ్వులెక్క...

xxx xxx xxx

పొద్దు గూకంగా వూర్లెకు రెండు లారీలచ్చినయ్...

బర్రెకు గడ్డికోసుకొని నెత్తిమీద మోపేసుకొని వస్తున్న లస్మవ్వ కిష్టారెడ్డి ఇంటికాడ మంది బాగ కన్పడితే ఆగింది.

లారీల్లల్లకెల్లి... పది బర్లు హుందాగా దిగినయ్... నల్లగ... నూనె పూసినట్టు నిగనిగ మెర్తన్నయ్. అందరు విచిత్రంగా సూత్తండ్రు... ఆ బర్లను చూసి లస్మవ్వ బీరిపోయింది.

"కిష్టరెడ్డి పటేలు పంజాబునించి కొనుక్కచ్చిండు... ముర్రాజాతి బర్రెలు... ఒక్కొక్క బర్రె ముప్పయ్ ఆరువేలు... బర్లు తొమ్మిదే... ఇంకోటి దున్నపోతు" అన్నడు ఒకాయినె.

"ఎనుకట ఇంగ్లీసోల్లు ఎర్రతోలుతోని గిట్లనే దిగిండ్రు..." అన్నడొక ముసలాయినె.

"నీగ్గానుక సమరయోధుల పించనత్తుందిరా తాతా... ఊకే ఇంగ్లీసోల్ల జోలి తీత్తవ్" కసురుకున్నడు ఓ యువకుడు.

పొట్టితల... ఇంకా పొట్టిమెడ... ఎడల్పుగ వెన్ను... చిన్నగ వంకర తిరిగిన కొమ్ములు...పొడుగుతోక... తెల్లటి కుచ్చు... పెద్ద పాలపొదుగు...

"బేంకులోను తీసుకున్నవానె కిట్టన్నా... బాగానే పైసలైవుంటయ్"  మొకమంత మాడ్చుకొని అడిగిండు రాజిరెడ్డి. కిష్టరెడ్డి పట్టిచ్చుకోలె...

"రోజుకు ఒక్కొక్క బర్రె ఇరువై లీటర్ల పాలిత్తయట... పిండెటోని జబ్బలుంటయా?" అన్నడొకాయినె.

"మనుషులు పిండుతార్ర... పాలు పిండే మిషిన్దెచ్చిండు కిట్టన్న" అన్నడు తారీప్ చేసుకుంట ఇంకొకడు.

లస్మవ్వకు ఆచ్చర్యమనిపిచ్చింది.

"పాలుపిండే మిషినా... గదెట్లుంది బిడ్డా..." పానం ఆపుకోక అడిగింది లస్మవ్వ. కిష్టారెడ్డి వట్టడబ్బాలకెల్లి... సైకిల్ పంపులు అతుక్కున్నట్టున్న ఓ మిషిన్ దీసిండు.

"ఇది పాదుగుకు పెడితే చాలు... పావుగంటల ఇరువై లీటర్ల పాలు పడుతయ్... దీన్ని మిల్కింగ్ మిషినంటరు" గర్వంగా చూపిచ్చిండు కిష్టరెడ్డి.

లస్మవ్వ పానం ఎల్లుకపోయింది...

"దుడ్డెబొక్కు మూతితోని పాదుగుని కుమ్మితే... తల్లి ప్రేమతోని పాలు కార్తది. పాలు గందుకే రుచుంటయ్... పాదుగు సండ్లను చేతితోని తడుమంగనే... ప్రేమగ కండ్లు మూసుకుంటది బిడ్డా... మనిషికి పసురానికి నడుమ గీ మిషిన్లేందిరా..." అన్నది.

"ఏ ముసల్దానా... నీకేం తెల్వే... ఇదంత మిషిన్ల కాలమేనాయే... తొమ్మిది బర్లంటే కమస్కం రెండువందల లీటర్ల పాలిత్తయ్... మల్ల గన్ని నీల్లు కలిపినా... నాలుగువందల లీటర్లయితయి. మస్కుల్నే జయితాలకు ఉరుకుతవ్ గదా... ఇగ మీ పాలెవడు కొంటడు. మన్ను బుక్కి మంచినీల్లు తాగినట్టే పో..." నవ్వుకుంట

అన్నడు సుతారి లింగన్న.

లస్మవ్వ గుండె జారిపోయింది.

"మా మందల కొడ్తవానె కిట్టన్నా..." అనడిగిండు బర్లమల్లిగాడు.

"ఏందిరో... ఇవి ఊరు మందల తిరిగే బర్లలెక్క కనవడ్తన్నాయిరా... సెపరేటుగా పాలేర్ను పెడ్తన్నం" మాయిల్లమే ఎల్తిపడుకుంట చెప్పింది కిష్టరెడ్డి భార్య బర్లకు మూడుసార్ల జిట్టి తింపింది.

"గా పోతు చూసినావె లస్మవ్వా... ఎట్లున్నదో... యములోని వాహనం లెక్కనే వున్నది" అన్నడు చిందు రామన్న.

లస్మవ్వకు ఇప్పుడన్ని బర్రెలు యములోడి వాహనాల్లెక్కనే కనవడ్తన్నయ్... భయమైంది... పెయ్యంత జరమచ్చినట్టు సవసవ అన్నది. అగులు బుగులై ఇంటిదిక్కు నడిసింది.

గడ్డిమోపు ఇంక బరువనిపిచ్చింది.

ఇంటిదగ్గరి సందుల మోర్లు కడ్తుంద్రు... తొవ్వంత పొక్కిలిలెక్కయింది.

"సంకరజాతిని ప్రేమిస్తరు... ఏం మనుసులో... జాతిగాదు, మనసులు సంకరం కావద్దు... రాన్రాను పాలపిట్టకు గండు పిల్లికి లెంకగడ్తరు గావచ్చు..." అనుకుంది.

బురదల అడుగుదీసి అడుగెయ్యత్తలేదు...

పాలు నీల్లలెక్క కల్సిపోయిన మనిషిని, ప్రకృతిని, శ్రమని ఎవలో విడగొడ్తుంద్రని భయమేసింది లస్మవ్వకు...

మనసంత పొగవట్టినట్టు... కూరాడు కుండ పగిలినట్టు ఒక్కపారి

తల్కాయల నొప్పి షురువైంది... "పరాయిదేదన్నా... ఈల్లకు పప్పుబెల్లమే" అని చీదరిచ్చుకుంది... అప్పుడే బురదల కుడికాలు జర్రున జారింది... సర్రున ఇరుసుక పడ్డది... గడ్డి మోపు ఎగిరిపడ్డది... 'కొడుకా... ' అన్నది నడుం పట్టుకుంట....

"అయ్యో... ముసల్ది పడ్డది" ఎవలో అన్నరు... అందరు ఉరికచ్చింద్రు... ఇంట్లకెల్లి కోడలు ఉరికచ్చింది ఏడ్సుకుంట...

ఇద్దరు లావట్టి ఇంట్లకు తీసుకచ్చి మంచంల పండవెట్టింద్రు... కోడలు బురదంటిన చీరె విప్పి వేరే చీరె చుట్టింది. ఎవలు చెప్పింద్రోగనీ... కొడుకు రాజేశం ఆరెంపీ డాక్టర్‌ను తోలుకొని వచ్చిండు.

"ఎట్ల పడ్డవే అవ్వా..." అని ఏడ్సుడు మొదలువెట్టిండు.

ఆరెంపీ ఇంజెక్షన్ ఇచ్చి గుల్‌కోస్ పెట్టిండు. పక్కకు పొర్లిచ్చి చూసిండు.

"నడుం బొక్క పర్రెవాసినట్టుంది... అతుకుడు కష్టమేనే రాయేషమన్నా... ఇగ మంచిగ చూసుకోండ్రి. గుల్‌కోస్ దిగే వరకస్తా..." అని పోయిండు.

ఎనుకనే "మరి జయితాలకు తీసుకపొమ్మంటరా" అనుకుంట నడిసిండు రాజేశం.

కోడలు సుజాత ఏడ్పు కూడా తరమైతలేదు.

"నాకేం కాలేదు బిడ్డా... గట్ల పరేసాను గాకుండ్రి... పాలెవలు పిండాలె బిడ్డా... రేప్పొద్దుగాల వాడుకపోల్లకైతే పాలు పోసిరాండ్రి" అన్నది లస్మవ్వ.

"నువ్వేం రంది పెట్టుకోకు అత్త... వాడుకాలు నీ కొడుకు చూసుకుంటడు" అనుకుంట తలాపుకు కూసోని కొంగుతోని ఇసుర్తాంది సుజాత.

వాడల అందరు ఒక్కొక్కలు చూసి పోనత్తంద్రు.

"కోడలు పొల్లకు కట్టమచ్చింది... ముసల్ది మంచం నేసుడే... ఇగ లేసుడు కష్టమే" అనుకుంట పోతుండ్రు.

"గా గౌడిబర్లను సూడవోయిన... అయినోని వేషం పాలోనిదైనట్టున్నాయి. అనుకుంట ... మెల్లగనే వత్తున్నా... జర్రున జారా... పిడాత పడ్డా..." వచ్చినోల్లందరికి మొసపోసుకుంట చెప్తంది లస్మవ్వ.

డాక్టరిచ్చిన నిద్ర గోలీలేసింది సుజాత.

నిద్రల్నే జెనికినట్టవుకుంట... ఏదేదో కలవరిత్తంది.

"ఎనుగర్రకు కట్టిన బాసింగం... ఎవడో ఇడుసుక పోతుండ్రా... పట్టుకోండ్రి.." అనుకుంట...

రాజేశంకు ఎవలో చెప్పంగనే చాకలి లింగన్ని తీసుకచ్చి కల్లుతోని మొకం కడిగిచ్చిండు. మంచం మీదికెల్లి కోడిగుడ్డు తింపి పారేసిండ్రు...

లస్మవ్వ నిద్రబోయింది.

xxx xxx xxx

మబ్బుల్నే... "రాయేషా... ఓరి రాయేశం" అని పిలిసింది.

"ఏందే అవ్వా... నీ పక్కనే పండుకున్నం" అన్నడు కొడుకు

"బర్రెకు గడ్డేసి... పాలు పిండు బిడ్డా... కుక్కలు మొరుగదిక్క... బెదిరితే పాలియ్యది... ఇయ్యాల్ల నా నడుం లేసెటట్టులేదు. వాడుకాలు పోసిరా కొడుకా..." అన్నది రాజేశం లేసిండు... పాలుపిండి సీసాల్లల్ల పోసి సైకిల్‌కేసుకొని పోయిండు. సుజాతని పిల్చి "లగ్గమైన కొత్తల చిలాకోడూర్ జాతర్ల... మీ మామ తోని దిగిన ఫోటువ సందుగులున్నది బిడ్డా. తీసుకచ్చి ఎదురుంగ దిగూట్లె పెట్టు... నన్ను కూడా జెల్దికొంటవొమ్మని రోజు మీ మామకు మొక్కుత..." అన్నది.

సుజాత అటుకు మీది సందుగు తీసి... ఫోటో తుడిచి గూట్లె పెట్టింది.

వారం పది రోజులు గడిచినయ్... లస్మవ్వ కూరపేగోలే ఇంకింత ఇగ్గుకచ్చింది...

సుజవ్వా... సుజవ్వా... అని పిల్సుకుంట బర్రె గురించి జాగర్తలు చెప్తంది. "పెండ తీసేటప్పుడు సూడు బిడ్డా... పెండల తీగెలు, రక్తపు జీరలుంటె దానికి పానం బాగలేనట్టు" అన్నది.

ఓ రోజు కోటవ్వ వచ్చింది.

"వాడుకాలు సగం బందయినయే లస్మవ్వా... కిష్టరెడ్డి పటేలు పాలల్ల వెన్నదీసే మిషిన్ దెచ్చిండట... బెండు బెండు లెక్కున్నా మొత్తం ఆయనకే వాడుకాలు పెరిగినయ్" అని చెప్పుకుంట బాధపడ్డది.

"కష్టమాడిన ఇంట్ల కరువుండదంటరు... ఎన్నకు కూడా మిషిన్లచ్చినాయె" నడుం బాధ ఓర్సుకుంట అన్నది లస్మవ్వ.

"ఇంకో బర్రె ఈనింది. పెయ్యదూడనే గని వాడుకాలు లేకపాయె" అన్నది కోటమ్మ..

"మాయి పడ్డదానె... జున్నుపాలు పోచమ్మకు పెట్టచ్చినంక.. దూడ బొక్కకే పట్టియ్యాలె. పెయ్యదూడకు ఉప్పు, తవుడురాయి. బిడ్డను తల్లి నాకాలె..." అన్నది. సుజాత అన్నం కూర కలిపి తెచ్చింది. ఎంత బతిలాడినా లస్మవ్వ తిన్లే...

"కడుపుల లోపుతంది బిడ్డా" అన్నది.

"అన్నం ఉగ్గపడుతున్నావే ముసల్దానా... మంచంల్నే ఎత్తి పోసుడైతదని అనుకుంటున్నావా..." అని గద్రాయించింది. కోటమ్మ.

లస్మవ్వ కండ్లల్ల నీళ్లు తిరిగినయ్...

పొగవట్టిన వాసాల దిక్కే చూసుకుంట జెల్ది కొంచవొమ్మని దేవునికి దండం పెట్టింది.

"తిను అత్త... జెప్పన జారుతదని కొంచెం పచ్చిపులుసు కలిపిన" అని నోట్లె రెండు ముద్దలు పెట్టింది... కొంచెం కూసోబెట్టి నీల్లు తాగిచ్చింది.

కోటమ్మ వెళ్లిపోయింది.

ఇట్ల మూడు నెలలు గడిచినయ్... ఇల్లంత బెక్కొట్టినట్లయింది. వీపుకి పుండ్లయి పెయ్యంత ఒదులకిచ్చింది... లస్మవ్వ ఎముకల గూడే అయింది...

"సుజవ్వా... బర్రె నెమరేత్తుందా బిడ్డా... దానికి పానం మంచిగలేకపోతే ఒక్కోపారి కండ్లల్ల బుసులత్తయ్... రోమాలు బుగ్గరిచ్చినట్టు లేత్తయ్... పాలజ్వరాలత్తయ్ బిడ్డా... దానిది మన పుటుకు లెక్కనే... నోరువాయి లేని పసురమాయె... పాలు మంచిగ ఇత్తుందా బిడ్డా..." అనడిగింది.

సుజాత కండ్లల్ల నీల్లు తిరిగినయ్...

"దాని పాలు తాగక ఎన్నేండ్లాయె బిడ్డా... ఓపారి ఎప్పుడో... మూడో ఈత బర్రెయి గిలాసెడు పాలు తాగిన... నోట్లె అముర్తం పోసుకున్నట్లు ఇది తొమ్మిదో ఈత బర్రెనాయె" అన్నది.

తల్లి గోస చూసుటానికి రాజేశానికైతే మనసొప్పుతలేదు... ఎందుకో... దగ్గరికి రాలేకపోతున్నడు... కోడి కూయకముందు... రాయేశా... పాలు పిండి వాడుకాలు పోసిరా పో బిడ్డా... అని మంచంలకెల్లి అంటంది. నిద్రలేపుతది.

రాజేశం లేసి సైకిలేసుకొని పోతడు...

సుజాతని పిలిచి "ఒక్కోపారి బర్రెకు నాలుకమీద ముండ్లత్తయి బిడ్డా... ఉప్పు పసుపు కలిపి నాలుకమీద బాగ రాయాలె... రేపొసారి రాయమని రాయేశనికి

చెప్పు...." అని నాల్రోజులకోసారి యాజ్జేత్తది.

రోజురోజుకు లస్మవ్వ పానం ఎండుకపోతంది...

"గిసొంటి రాత అడుక్కచ్చుకున్న... కడుపుల పుట్టినోల్ల కన్న ఎక్కువనే అర్సుకోవడ్తివి..." అని రోజంత బారతం పెట్టినట్టు పాతులాడతది. రాజేశమైతె పెల్లిపిల్లోలె మంచం సుట్టు తిరిగిపోతడు.

"బర్రెకు తెల్కపిండి తెచ్చిపెట్టుండ్రి బిడ్డా... యాడాది పాడుగూత పసిగడుగులు పచ్చగడ్డి తింటె నోరు చేదెక్కుతది"

సుజాత మంచం దగ్గర కదలాడిప్పుడల్లా ఏదో మాట అంటనే వుంటది. "మనువన్నో, మనువరాల్నో చూసి పోతననుకున్న... కుచ్చులకుల్ల, జిట్టిపూసలు దెచ్చి సందుగులపెట్టిన..." అని కండ్లనీల్లు తీసుకుంటది.

"దాలిల పాలకుండ పెట్టినంక కైషిప్పతోని కుండ గీకెదాక రాయేశడు దాలికాన్నే కూసుంటుండె... మన బర్రెది పాలగోకు రుచిగుంటది... సల్లనైతె అడుక్కపోనోల్లు లేరు..."

ఇట్ల ఎప్పుడో మాట చెప్పే లస్మవ్వ నాల్రోజుల్నించి ఏం తింటలేదు. జావకాసి పోత్తె నాలుగు చెంచాలు తాగుతంది... బేదాన తినిపిస్తె రెండు, మూడు తింటంది.

నోటి మాట బందయింది.

రేపో... మాపో... అన్నట్టు అందరు వచ్చి చూసిపోతుండ్రు...

ఓరోజు పొద్దుగాల్నే... మంచంల గెక్గెక్ మంటున్న అత్తని చూసి...

"అయ్యో... మా అత్త ఎట్లనో చేత్తుందుల్లో..." అని ఏడ్సుకుంట అందర్ని పిలిచింది సుజాత.

అయిదారుగురు ఆడోల్లు మొగోల్లు బిరాన్నే ఉరికచ్చింగ్రు.

"పానాలు పోయెటట్టున్నయ్... కిందెయ్యిండ్రి... కిందెయ్యిండ్రి" అన్నరు. సుజాత ఏడ్సుకుంటనే జెట్టన తుంగచాప దెచ్చి పర్సింది... రాజేశం బొచ్చె గుద్దుకుంట ఉరికచ్చిండు...

లస్మవ్వను కిందేసిండ్రు...

కండ్లల్ల నీల్లతోని అందరికి దండం పెట్టింది...

"కొన్నన్ని తులసినీల్లు పొయ్యిండ్రి" అన్నరెవలో

పందిట్ల తులసాకులు తెంపి నీల్లల్ల వేసుకచ్చిండ్రు... చెంచతోని రాజేశంను నోట్లె పొయ్యిమన్నరు.

లస్మవ్వ ఏదో చెప్పాలని బల్మీటికి నోరు తెరిసింది...

"న్నాకు...మన.... బర్...రె...పా...లు...పొ...య్యిం....డ్రి..." అన్నది. నాలికె పెకిలిచ్చుకుంట... గొంతెల్తలేదు.

అందరు మొకాలు చూసుకున్నరు.

అందరి కండ్లల్ల నీల్లు దునికినయ్...

సుజాత ఏడ్సుకుంట సాయివాన్లకు ఉరికింది... పది నిమిషాల్ల గిలాసల పాలు దెచ్చింది.

"అత్తా... మన బర్రెపాలు దెచ్చిన... నోరు తెరువ్ అత్తా" అన్నది ఏడ్సుకుంట ఎక్కిల్లు పడంగ....

చెవులు గడెలు పడ్డట్టు... లస్మవ్వకు వినరాలేదు.

గిలాస చూపిచ్చుకుంట... మల్ల అన్నది సుజాత.

లస్మవ్వ నోరు తెరిచింది...

సుజాత చెంచతోని రెండు చెంచాల పాలు పోసింది.

లస్మవ్వ పాలు మింగలేదు...

కోపంగా.. దుఃఖంగా... ఊంచింది. పాలు చెంపకింది నుంచి పక్కకు కారిపోయినయ్...

"బర్రె... నమ్మి...కున్నార్రా...ఇవి...మన...బర్రె...పా...లు...కా...వు..."

లస్మవ్వ తల పక్కకి వాలింది.

అందరు ఒక్కసారి పిడుగువడ్డట్టే ఏడ్సింఫ్రు... రాజేశం, సుజాత.... లస్మవ్వ మీదపడి... గుండెలు పగిలేటట్టు ఏడ్తంఫ్రు...

సుజాత నెత్తంత కొట్టుకుంటంది.

"అత్తా... మన బర్రె నీకన్నా ముందే సచ్చిపోయిందే అత్తా... ఎర్రికుక్క కరిచి సచ్చిపోయి రెన్నెల్లయిందే అత్తా... బర్రె చచ్చిపోయిందని తెలిత్తె... నువ్వు బతకవని చెప్పలేదే అత్తా..."

సుజాత ఏడ్పు తరమైతలేదు...

ఆ మాటలు విని అందరి గుండెలూ అవిసిపోతున్నయ్...

"ఊర్లెకచ్చిన ముర్రెజాతి దున్నపోతు పాడిత్తేనే... రాజేశడు రెండువేలు ఖర్చుపెట్టుకొని బర్రెను బతికిచ్చుకున్నడు...అది చచ్చిపోతే మా అవ్వ చచ్చిపోతదని... గాశారం చాలక మల్ల ఎర్రికుక్క పాడుగాను వూర్లె మూడు బర్రెల్ని కరిసింది..."

అంత దుఃఖంలోనూ... జ్ఞాపకాలు నెమరేసుకుంటంది వూరు.

*